# తెగతెంపులు

ఎండ్లూరి సుధాకర్

పల్లెటూల్లల్లో పొద్దుబొయ్యేది శానా కష్టం. అన్నే వుండేవోల్లైతే పనీ పాటకి బోతావుంటరు గాని ఇట్టనే సుట్టపుసూపుగా వొచ్చే వోల్లకైతే పొద్దుబోగక పిచ్చి బట్టిపోతది. అసలే యండాకాలం. ఐదు గంటలకే తెల్లంగ తెల్లారి పోతుండది. ఇంగన ముందల యెట్ట పొనుకునేది? నిదరొస్తా వున్నా గూడా అట్టనే లేసి కూసుకునేది. మా వొల్లు మాత్రం ఇంగా నిద్రబొమ్మనేది.

నేను రావిగుంటపల్లిలో వున్నన్ని రోజులు ఇట్టనే జరగతా వుండింది. ఆయాల గూడా అట్టనే పొనుగోనుండగా మా ఇస్రయేలు బావొచ్చి నన్ను లేపినాడు.

"యాంది బావా! ఇంగ లెయ్యలా? సావిట్లోకి బోదంపా. యియ్యాల సునీత పంచాయితి గదా?" అన్నాడు.

నేను లేచి మొకం కడుక్కోని ఇంత కాపీ తాగి ఆడకి బోదమని పయానమైన.

** ** **



సునీత మా బెంచిమేను సిన్నాయిన కూతురు. ఆ పిల్లకి నిండా పదమూడేల్లు లేవు. కనిగిర్లో టీచరమ్మింట్లోనే వుంటా పన్జేసుకోని నాలుగు డబ్బులు సంపాయిచ్చి యింటికి అంపిస్తుంటది. పల్లెటూల్లల్లో పదేల్లు దాటితే పెల్లికి వొగిసొచ్చి నట్టు. సునీతకి పన్నెండేల్లుదాటినయ్యాని వోలమ్మ, నాయన తొందరపడి కనిగిరి నుంచి తీసకొచ్చి యింట్లో పెట్టుకున్నారు.

మా సుట్టాల పిల్లోడు సునీతని జూసి సచ్చి ఆరు మానికల రాగులు, గంపెడు తునకలు ఓలిచ్చి పెల్లి జేసుకున్నాడు. ఇంతా పెల్లయ్యి యిరవై రోజులు గాలా! అప్పడే యీయమ్మి వుట్టింటికొచ్చి కాపరా నికి పోనంటుండది. ఎవురు జెప్పినా యింటంలా! సునీత మొగుడు మాత్రం ఆ యమ్మే గావాల్నని పట్టుబట్టి పంచాయితీ బెట్టించివాడు.

** ** **

లట్టా యిట్టా జేసి పంచాయితీ మొదలయ్యే కాడికి పొద్దెక్కి యెనిమిది గంటలయ్యింది.

సునీత సావిట్లో నిట్టాడుకి ఆనుకోని నిలబ డుండది. మా గుండెం పెద్దోల్లంతా ఎదురుగా ఈతసాప లేసుకోని కూసోనుండారు. ఇంకో తట్టు సునీత మొగుడు, సునీతోల్ల అమ్మ, నాయిన నిలబడుకోనుండారు.



ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక 7-3-97

పంచాయితీ తీరుమానం యినే దానికి వొచ్చి నేల్లమంతా యాడండే ఆడ కూసోని తలా వొక మాట మాట్లాడతా వుండారు.

"ఆడదాని పెత్తనం, తంబళ్ల దొరతనం వొకటే గదంట్రా! ఆడది మొగోడి మాటిని నడుసుకోవాల. అప్పడే గదా కాపరం నిలబడేది! అంటున్నడు వొక ముసిలాయన.

"మ్మేయ్! సునీత! నువ్వు కాపరానికి బోకుండా వుట్టింట్లోనే వుంటానంటవు. కారనమేంది సెప్పు?" అనడిగినాడు.

"ఆ అబ్బయ్యని ముందు నాకు జూపియ్యలా! అయినంటే నా కిస్టం లా!" తలకాయొంచుకోని జెప్పింది సునీత.

ఆ మాటికి ఆడున్నోల్లందరూ మొకాలు జూసు కున్నారు.

సునీత మాత్రం తలకాయెత్తి దాని మొగుడి సాయ సూట్టం లా, ఆ పిల్ల మొకంలో పసితనం పాలుగారినట్టు కారతా వుంది. ఎర్ర చాయలో కెంపు మాదిరి మెరస్తావుంది. వూల పావడా, ఎర్ర రైక తొడుక్కోనుంది. మెళ్లో తాళిబొట్టు జూసి నమ్మాల్సిందే గానీ ఆ యమ్మికి పెళ్లయిందంటే ఎవురూ నమ్మరు.

సునీత సెప్పిన మాటకి పెద్దాయనకి కోపమొచ్చింది.

"యాంది మే, అంతా నీ యిస్టము, నా యిస్టమే ననుకుంటుండవా పెళ్లంటే? వొక మంచీ సెబ్బరా వుండబల్లే?" అన్నాడు గదమాయిస్తా.

"తాళిగట్టినప్పడన్నా జూల్లే! మానూరికి ఎన్నో సార్లు వచ్చిండు. అప్పడన్నా జూల్లా? వాడేమైనా కొత్తోడా ఈ వూరికి? ఈ వూరి మనువడు గదా? సునీత బుగ్గలు బొడస్తా అడిగింది వోల్ల జేజెమ్మ.

ఇంగ సునీతోల్ల అమ్మ పెద్దంగా యేడస్తా మొత్తుకుంటా వున్నది.

"నువ్వేడిస్తే దాని కావురం నిలబడద్దా? యేడు పాపి సంగజ్జాదు" అంటూ ఎవురో అదిలిచ్చిను.

"ఆ యమ్మి జూసిందయ్యా!, ఆయాల జేసు కుంటానన్నది. పీటల మీనకూకున్నది ఇయ్యాల వొద్దుపో అంటా వుంది. వాల్ల నాయిన దీని సంగతి పట్టించుకుంటుండా? తాగి వూరిమీన పడతా వుంటే నా రెక్కలు ముక్కలు జేసుకోని దీన్ని పెంచి పెద్దజేసి పెళ్లి జేస్తిని. ఇయ్యాల యిది యీ రకంగా పరువు దీసి ఈదిలో బెట్టింది. దీని బతుకు బాగా జేస్తా మీ రుణం దీర్చుకుంటా!" ముక్కు చీదుకుంటా అన్నది వోలమ్మ

"ఆడదాని సంగతి ఎవురికీ అర్థంగాదు. మూర్ఖు దెచ్చి యింట్లో బోసినా ఇంకోడితో పోద్ది ఆడది. కనిగిర్లో యాం కతలు బడ్డదో ఎవురికి దెల్సు? అందుకనే గావాల ఈ మొగుడొద్దు అంటా వుంది" పెళ్లికొడుకు తాత అయేన పడిపోతూ అన్నడు.

ఆ మాటకి సునీత రోసంతో తలెత్తి ముసిలోడ్ని కొరకొర నమిలేసేటట్టు జూసి గట్టిగా కేకేరిచ్చి నేలమీన తుపుక్కున వూసింది.

సునీత పక్క సుట్టాలందురూ ఆ మాటన్న ముసిలోన్ని తలా వొక మాటని తగువులాడిను.

అందుర్నీ గమ్మునండమన్జెప్పి పంచాయితీ పెద్ద లేసి నిలబడినాడు. కూడా దీసుకోని వొక్కొక్క మాట జెప్పినడు.

"యేం తెలివి లేదా మీకు? మానజల్మ ఎత్తలా మీరు? వొక పక్క సునీత ఆ మొగున్ని వొప్పకో డంలా! ఎందుకీ రచ్చ పొద్దు గూకుల? తెగ దెంపులు జేసుకోని కాయితం రాసిపార టము, యేదో వొకటి వొగదెంచుకు పోవటము. యేదో వొకటి జరగాల! గుర్రాన్ని వాగు కాడకి తీసకపోతం గానీ బలిమిటికి నీల్లు తాపతామా? యిది గూడా అంతే.

"రేయ్! సుందర్రావా!

నేన్జెబతుంటా యిడాకులు రాసెయ్" అంటా రవుద్రంగా జెప్పినాడు.

పంచాయితీ పెద్ద కూసోనిమంచి నీల్లు తాగిందాక అందురూ మాటలు మర్సిపోయి కూసున్నరు.

"ఆ పెళ్లికొడుకు ఈయాల యేడికి బొయ్యినా రొండో పెల్లోడు అవుతడు. ఆ యమ్మి మల్లా పెళ్లి జెయ్యాలన్నా దానికీ రొండే ల్లే. ఎందుకొచ్చిన తంటా నాయనా? దాన్ని కాపరానికి బంపియ్యండి" అంటూ సునీత అమ్మ బతిమిలాడతున్నది.

ఇంగ సునీత "యమా!" అంటా పెద్ద కేక బెట్టింది.

అందరూ బిత్తరపొయ్యి సునీత సాయ జూసిను.

ఆ పిల్ల కోపంతో వూగిపోతా వుంది. మాంకాళి మాదిరిగా బసలు గొడతా వుంది. సెంపలు, కళ్లు ఎర్రగా సింతనిప్పల మాదిరి మండుతా వుండాయి.

"నన్ను మీ రెవురూ కాపరానికి పంపియ్యలేరు. వోడంటే నా కిస్టం లే! పెళ్లికి ముందు వోడి మొకమే జూసినా! వాడు నల్లగా వున్నా, పొట్టిగా వున్నా సరేలే అని పెళ్లికి వొప్పకున్నా. లోడికి వొల్లంతా బొల్లి మచ్చలు. యేల్లకి పెద్ద రోగమొచ్చి నట్టు ముదుసుకోనుండయ్యి. యిదంతా నాకు నచ్చలా! తెగదెంపులు జెయ్యండి! తలకాయ పైకెత్తుకోని అందరి సాయ జూస్తా ధైర్యంగా జెప్పింది. ఇంగ దెనికి తిరుగులేదన్నట్టు.

యాడోల్లాడ మాట బడిపోయినట్టు కూసు న్నరు. రొంచేవుటి దానమ్మ లేసి యిట్టన్నది.

"రేడియాలో జెబతుంద్రా! పిల్లోడికైనా, పిల్లకైనా వొగిసు కరకట్టుగుండాల. మైలేజీ దీరింది. ఈ పిల్లకింకా మైలేజి దీరలా!

పెళ్లయి యెంత? యిరవై రోజులు అయ్యిందో లేదో!

ఈ పిల్ల ఇంకా వొళ్లు పొందుకోక పోయే! యింత తొందరపడి ఇంగనెవురూ సిన్నతనాన పెళ్లిల్లు జెయ్యబాకండి!

"అయితే యిడాకులు రాసిచ్చి యెయ్యి రూపాయలు నస్టం గట్టిస్తవా?" అనడిగినాదు పెద్దాయన.

సునీత వోలమ్మ సాయ జూసింది.

"నా వల్ల గాదమ్మ! యెయ్యి రూపాయలు నేనెన్నుంచి దెచ్చేది? నువ్వు కాపరానికి బోతే అన్ని బాధలు తీరిపోతయ్యి" అన్నదామె.

"పెళ్లికూతురు సంసారం వొద్దంటే ఆయమ్మి డబ్బు గట్టాల. పిల్లోదు వొద్దంటే వాదు గట్టాల" అన్నాదు పెద్దయన మల్లా.

సునీత మొగుడు సిగ్గుతో తలకాయొంచుకోని కూసోసున్నదు. అవుమానంతో తలెత్తడంలా!

సునీత అందరిసాయ జూసి ఇట్టన్నది. "ఆ బొల్లి మచ్చలోన్ని, పొట్టిసేతులోన్ని నేను మొగుడిగ వొప్పకోను. నేను కూలినాలి జేసుకోని, పది మంది ల్లల్లో పాసిపన్లు జేసి యెయ్యి రూపాయలు నస్టం గట్టిస్తా. తెగ దెంపులు జేసి యిడాకులు రాసు కోండి" అంటూ అందర్నీ దోసుకుంటా అన్నుంచి యెల్లిపోయ్యింది.

** ** **

పల్లెటూరి పిల్లకి యింత ఆలోశన యెట్టొచ్చిందనోనని నాకు బలే సిత్రం దోసింది. వొగిసుతో సంబంధం లేదుగానీ వోల్ల పరిస్తితలే అంత దైర్నం, తెలివి, తెగింపు వుట్టిస్తయి. కావాల అనుకున్నా నేను. కాకుంటే సునీత మాదిరి అందురూ మనసులో మాట ధైర్నంగా జెప్పి ఎదురు నిలబడలేరు.

ఇంగ సునీత అదే రాతిరి గూడెం యిడిసిబెట్టి కనిగిరి బస్సెక్కింది.

— ఎండ్లూరి సుధాకర్



అలక

అమృతాసింగ్, సయీఫ్‌ఖాన్ విడిపోనున్నారని ఆ మధ్య వార్తలొచ్చాయి. ఈ మధ్య ఒక ఫంక్షన్‌లో వారిద్దరూ తగూలాడుకుని చెరో విమానం ఎక్కి చక్కా వెళ్లిపోయారు. ఆ తర్వాత మళ్ళీ చెట్టాపట్టాలేసుకుని తిరిగారుట. ఆ మాత్రం అలకలు లేకపోతే ఎలా అనుకున్నారో ఏమో.

— రఘు